ప్రజాశక్తి

శనివారం 3 జూన్ 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





మహిళా రెజ్లర్ల గోడు పట్టదా ?

◆ ప్రధాని మోడీ తీరు శోచనీయం ◆ తక్షణమే బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయండి
◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ప్రజా సంఘాలు డిమాండ్



కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టిన వార్వా, నివాస్ నాయకులు

తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపీ, డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలంటూ దేశ రాజధానిలో పోరాటం చేస్తున్న మహిళా రెజ్లర్లపై కేంద్ర ప్రభుత్వ నిర్బంధకాండను ఖండిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శుక్రవారం పలు కార్యక్రమాలు జరిగాయి. రెజ్లర్లకు సంఘీభావంగా పెద్దపెట్టున ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు నినదించారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసి బిల్డింగ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం వార్వా, నివాస్ ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీల్లో పలు పతకాలు సాధించిన క్రీడాకారిణులు న్యాయం కోసం కొద్ది రోజులుగా రాజధానిలో పోరాడుతున్నారన్నారు. దోషులను శిక్షించడానికి బదులుగా శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఆ బాధితులపై ఢిల్లీలో ఘోరంగా దాడి జరుగుతోందన్నారు. బ్రిజ్ భూషణ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం, బాధిత రెజ్లర్లపై దాడులు చెయ్యడం అంతర్జాతీయంగా మన దేశ ప్రతిష్టను దిగజార్చినట్లయిందన్నారు. రెజ్లర్లపై పోలీసు చర్యను ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ, యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ సంస్థలు ఖండించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో వార్వా ప్రధాన కార్యదర్శి బి.బి.గణేష్, నివాస్ కార్యదర్శి పి.నారాయణమూర్తి, నాయకులు ఎన్.ప్రకాష్‌రావు, మిగతా 2లో..



నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

▸ వార్త 2లో..

రైల్వే సేవల మెరుగుకు కృషి

▸ వార్త 2లో..

ఘనంగా ప్రకృతి వ్యవసాయ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నగరంలోని గాదిరాజు ప్యాలస్‌లో ఎపి ప్రభుత్వం (రైతు సాధికార సంస్థ) ఆధ్వర్యాన శుక్రవారం ప్రకృతి మేళా (ఆర్గానిక్ వ్యవసాయ ప్రదర్శన) జరిగింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, ఆర్‌వైఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్‌కుమార్ ప్రారంభించారు. దీంట్లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన రైతులు, ఎన్‌జిఒలు, ఎంటర్‌ప్రూనర్‌లు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, దేశీయ వరి విత్తనాలు ఇలా పలురకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మిగతా 2లో..



5 నుంచి ఎకో-వైజాగ్

▸ వార్త 2లో..



దేశంలోనే వినూత్నం.. ప్రజల ముంగిటకే వినోదం

ఎపి ఫైబర్ కార్పొరేషన్ 'మొదటి రోజే మొదటి షో' ప్రారంభంలో మంత్రి అమర్‌నాథ్

కెజిహెచ్ రోగులను ప్రైవేటుకు తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్‌కు వచ్చే రోగులను ప్రైవేట్ క్లినిక్స్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అటువంటి క్లినిక్‌ల గుర్తింపు రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున హెచ్చరించారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు.

వైద్యులు పూర్తి స్థాయిలో సేవలందించాలి
విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ఆసుపత్రి అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ముందుగా హెచ్‌ఒడిలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పలు విభాగాధిపతులు తమకు కావలిసిన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మహిళా రెజ్లర్ల గోడు పట్టదా ?

కెవి.రమణమూర్తి, జెపి.శర్మ, కెఎం.కుమార్ మంగళం, కె.సత్యవతి, ఎం.మోహన్‌రావు, కృష్ణమోహన్, ప్రభాకర్, నాయనబాబు, సంతోష్ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలంటూ మహిళా చేతన ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఆర్ఎఫ్ నాయకులు అనురాధ, పికెఎస్ ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, భారత నాస్తిక సమాజం నాయకులు వై.నూకరాజు, రాంప్రభు, సూరిబాబు, విజ్ఞానంద్ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

ఉక్కునగరం : లైంగిక వేధింపులకు గురై, న్యాయం కోసం ఢిల్లీలో నెల రోజులుగా మహిళా రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని ఐద్వా స్టీల్ జోన్ నేతలు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రెజ్లర్ల న్యాయపోరాటానికి సంఘీభావంగా శుక్రవారం సంఘం ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో మహిళలు నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వరలక్ష్మి, వేణు మాట్లాడారు. బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.విజయలక్ష్మి, పి.పుష్ప, కె.సుశీల, ఎ.సూర్యప్రభ, జి.శృతి, అనకాపల్లి నాయకులు మాణిక్యం పాల్గొన్నారు.

కెజిహెచ్ రోగులను ప్రైవేటుకు తరలిస్తే చర్యలు

మౌలిక వసతులు, మెడికల్ సామగ్రి వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కమిటీకి వివరించి, పూర్తిచేసిన పనుల వివరాలు తెలిపారు. శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో మల్లికార్జున 15 పనులుగాకు సుమారు రూ.కోటీ 10 లక్షలకు, వైద్య పరికరాల నిమిత్తం రూ. కోటికి ఆమోదం తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన వనరులపై చర్చించారు. కెజిహెచ్‌లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సమావేశం అనంతరం నర్సింగ్ సిబ్బంది తమకు కల్పించిన సౌకర్యాల పట్ల సంతృప్తి చెంది కలెక్టర్‌కు సన్మానం చేశారు. సమావేశంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ బి.వి.నాయుడు, కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రకృతి వ్యవసాయ మేళా

పండించిన పంటలు తినడం వల్ల ఆరోగ్యం కలుగుతుందని విజయ్‌కుమార్ వెల్లడించారు. కరోనా తర్వాత ఆరోగ్యంపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందని అందుకు అను గుణమైన ఉత్పత్తులవైపు దృష్టిసారించడంతో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత పెరిగిందని, ఈ ప్రదర్శన అందుకు వేదికైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి స్టేట్ మార్కెటింగ్ అధికారి టిఎల్.ప్రభాకర్, రీజనల్ ప్రకృతి వ్యవసాయ అధికారులు ఆర్‌పిసి కృష్ణారావు, ఆర్‌టిఎల్ ప్రకాష్‌రావు, ఆర్‌టిఒ హేమసుందర్, విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, ఎఎస్ఆర్, పార్వతీపురం జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న అధికారి

5 నుంచి ఎకో-వైజాగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న ఎకో వైజాగ్ పేరుతో ఒక వినూత్న కార్యక్రమం చేపట్టబోతున్నామని జివిఎంసి కమిషనర్ సిఎం సాయి కాంత్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ హరి వెంకట కుమారి ఆ రోజు సాయంత్రం ఆర్‌కె.బీచ్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. శుక్రవారం సాయంత్రం జివిఎంసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ 2022లో దేశవ్యాప్తంగా 4355 నగరాలతో పోటీపడి విశాఖ నగరం నాలుగో స్థానంలో నిలిచిందని, ఆ విజయానికి కొనసాగింపుగా విశాఖ నగరాన్ని మరింత మెరుగు పరచడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భావితరాల భవిష్యత్తుతో పాటు మానవ మనుగడకు అత్యంత కీలకమైన ఐదు అంశాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు. పరిసరాల శుభ్రత, పర్యావరణాన్ని కాపాడటం, నీటి సంరక్షణ, బీచ్ క్లీనింగ్, ఇంకుడు గుంతలు తవ్వడం వీటిలో ముఖ్యమైనవన్నారు. ఇకో వైజాగ్ కార్యక్రమంలో పొందుపరిచిన ఐదు అంశాలను అమలుపరిచేందుకు 10 ఎన్‌ఫోర్స్‌మెంట్ వెహికల్స్‌ను ఆ రోజు సభా వేదిక వద్ద ప్రారంభిస్తామన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించడమే ధ్యేయం

మేయర్ హరివెంకట కుమారి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జివిఎంసి తాగునీటి విభాగపు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఉన్న తాగునీటి ట్యాంకులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజల నుంచి తాగునీటి సమస్యలపై అధిక ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని మంచినీటి ట్యాంకులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రతి ట్యాంకునూ శుభ్రపరచాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆ పని జరుగుతున్నందున శుక్ర, శనివారాల్లో మూడు, నాలుగు, ఐదు జోన్లలోని కొన్ని ప్రాంతాలలో తాగునీటి సరఫరా ఉండదని, అందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యవేక్షణలో జివిఎంసి పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజినీర్ శేఖర్, సహాయక ఇంజినీరు వెల్సన్ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి

విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒక్కరి కోసం అందరం.. అందరి కోసం ఒక్కరు అనే సైద్ధాంతిక ప్రాతిపదికతో నడుస్తున్న విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు సేవలను వినియోగించు కోవాలని ఆ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు వినియోగదారులకు పిలుపు నిచ్చారు. శుక్రవారం పోలమాంబ కల్యాణ మండపంలో నిర్వహించిన వాల్తేరు బ్రాంచి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 108 ఏళ్లగా నడుస్తున్న తమ బ్యాంకు అవసరమైన వారందరికీ తక్కువ వడ్డీకి రుణాలు అందించడంతో పాటు, డిపాజిట్ దారుల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను వివరించారు. దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద అర్బన్ బ్యాంకుగా ఉన్న తమ బ్యాంకు పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి కోసం పని చేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు, ఆంక్షలు పెట్టినా.. ప్రజల నమ్మకంతో దినదినాభివృద్ధి సాధిస్తున్నట్లు తెలిపారు. రిజర్వు బ్యాంకు విధిస్తున్న ఆంక్షలు సహకార బ్యాంకుల అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని సభ్యులకు వివరించారు. అయినా తమ బ్యాంకును లాభాల బాటలో నడిపించి ఆ సొమ్మును డివిడెండ్ రూపంలో సభ్యులకు పంచుతున్నామని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డైరెక్టర్ పార్వతి దేవి బ్రాంచి పురోగతిని వివరించారు. మరో డైరెక్టర్ జెవి.సత్యనారాయణ మూర్తి కో-ఆపరేటివ్ బ్యాంకులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. బ్యాంకు సిఇఒ నరసింహ మూర్తి బ్యాంకు అందిస్తున్న సేవలను, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో బ్యాంకు సీనియర్ వైస్ ఛైర్మన్ గుడివాడ భాస్కరరావు, డైరెక్టర్లు కాకి భవాని, ఆదినారాయణ శాస్త్రి, బ్యాంకు జెడిఎం తిరుమలరావు, మేనేజర్ యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవేంద్రరావు

రైల్వే సేవల మెరుగుకు కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వే సేవలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు వాల్తేరు రైల్వే డిఆర్ఎం అనూప్ సత్పతి తెలిపారు. 118వ డివిజనల్ రైల్వే వినియోగదారుల కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నగరంలోని డిఆర్ఎం కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు రైల్వే సేవలను మెరుగుపరచడానికి విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు, డివిజనల్ శాఖాధికారులు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన జిల్లా బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు (సిఎంఆర్ కప్ - 2023) పోలీస్ బ్యారెక్స్ బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు నిర్వహించే ఈ బాస్కెట్‌బాల్ పోటీలలో 12 బాలుర జట్లు, 6 బాలికల జట్లులో కలిపి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలలో ఎంపికైన జట్లను ఈ నెల 29 నుంచి కృష్ణా జిల్లా నూజివీడులో జరిగే అంతర్ జిల్లా పోటీలకు ఎంపిక చేయనున్నారు. విశిష్ట అతిథిగా హాజరైన విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ సిఎం త్రివిక్రమ వర్మ, ముఖ్య అతిథులు సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, రిటైర్డ్ అడిషనల్ ఎస్‌పి టిఎస్ఆర్.ప్రసాద్, విశాఖ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అధ్యక్షులు సునీల్ మహంతి పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ పర్యవేక్షకునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ సిఎం.త్రివిక్రమ వర్మ మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక పరివర్తన వస్తుందని, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి గుర్తింపుతో పాటు మంచి భవిష్యత్తు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆటల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, నైపుణ్యంతో క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ బి.పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విధి నిర్వహణలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కారుణ్య నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులను ఉద్దేశించి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. విధుల్లో ఉండి మరణించిన 13 మంది ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాల పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో మెలుగుతూ జివిఎంసికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



. అంత్య క్రియలు నిర్వహిస్తున్న సేవాస్ఫూర్తి సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : రవీంద్రనగర్ బస్టాప్‌లో గత కొద్దిరోజులుగా ఉంటున్న అనాథకు బతికుండగా తిండితిప్పలు పెట్టిన సేవాస్ఫూర్తి అసోసియేషన్ ప్రతినిధులు, ఆ వ్యక్తి చనిపోయాక అంత్యక్రియలను నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. రవీంద్రనగర్ బస్టాప్‌లో తీవ్ర అనారోగ్యంతో నడవలేని స్థితిలో దాదాపు యాభైఏళ్ల వయస్సున్న వ్యక్తి ఉంటున్నాడు. అతని దుస్థితిని సేవాస్ఫూర్తి అసోసియేషన్ ప్రతినిధులు ప్రతి రోజూ అనాథకు భోజనం అందించి ఆదుకున్నారు. అవసరమైన వైద్యసేవలను కూడా అందించారు. అయితే అనాథ వ్యక్తి శుక్రవారం ఉదయం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసులకు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు తోటగరువు శ్మశానవాటికలో సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించి, ఖననం చేశారు. సేవాస్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, ఇమంది లక్ష్మణ్, ఎస్. ఆనందరావు, ఐ.గోపాల్, సిహెచ్.పద్మాజీ, ఆర్.ఎల్లాజీ, ఒ.పోలిరాజు, ఎన్.శివ, ఎం.వాసు, ఒ.అనిల్ ఉన్నారు.

అందుబాటులో మెరుగైన వైద్యసేవలు



డాక్టర్ ఫణికుమార్

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గ ప్రజలకు సాధారణ, అత్యవసర వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌ఛార్జి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎం.ఫణికుమార్ అన్నారు. ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కనకదుర్గ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో ఆమె స్థానంలో డాక్టర్ ఫణికుమార్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించగా, శుక్ర వారం స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన ప్రజాశక్తితో డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ, నవజాత శిశువులకు ఇప్పటికే కేటాయించిన న్యూ బోర్న్ సిబిలింగ్ (ఎన్‌బిఎస్) ప్రత్యేక గదిని మరింత మార్పులు చేయనున్నట్లు తెలిపారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, చిన్న పిల్లల వైద్య నిపుణులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్, దంత వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో భాగంగా గైనకాలజిస్ట్ 15 రోజుల పాటు ఆసుపత్రిలో అందుబాటులో ఉండి గర్భిణులకు సేవలు అందిస్తారన్నారు.

భానోజీతోటలో ప్రభుత్వ స్థలం కబ్జా

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి బానోజీతోటలో ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. సర్వే నంబరు 82, 86 సరిహద్దులు ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జా గురైంది. ఈ స్థలంలో కొంతమంది నిర్మాణాలు చేపట్టగా, మరి కొంతమంది చదును చేసి నిర్మాణాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ వార్డులో ప్రభుత్వ స్థలం ఎక్కువగా ఉంది. ఏటా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. వార్డులోని అధికార పార్టీ నాయకులు కబ్జాలు చేసి తర్వాత లక్షలాది రూపాయలకు అమ్మకాలు చేస్తున్నారనే



ఆక్రమణకు ప్రభుత్వ స్థలం చదును చేస్తున్న వ్యక్తులు



అక్రమంగా నిర్మిస్తున్న భవనం.

విమర్శలు వినిపిస్తున్నాయి. నెల రోజుల క్రితం వైసిపి నాయకులే ఒకరి మీద ఒకరు ఫిర్యాదు చేసుకొని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించారు. అధికార పార్టీ నాయకులు కబ్జాలకు పాల్పడుతుండటంతో అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై నూతనంగా వచ్చిన గాజువాక తహశీల్దార్‌ను వివరణ కోరగా పరిశీలిస్తామని చెప్పారు.

మహోజ్వల పోరాట ఫలితమే తెలంగాణ

ఉత్సాహభరితంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : అమరుల మహోజ్వల పోరాట ఫలితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన అని ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు అన్నారు. శుక్రవారం ఉక్కునగరంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షులు ఎన్. కుమారస్వామి వేడుకలకు అధ్యక్షత వహించి కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారని, వారి స్ఫూర్తి తో మన మంతా ముందుకు సాగాలన్నారు. ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ , తెలంగాణ కోసం పోరాడిన వీరుల త్యాగాలను మరచి పోకూడదన్నారు. వేడుకలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధికారులు ఎన్.వీరేశం,



కేకు కట్ చేస్తున్న సంఘ అధ్యక్షుడు కుమారస్వామి

ఎంకెవి మోహనరావు, వేణుగోపాల్, సీ జాయింట్ సెక్రటరీ ఆర్.నరసింహ, సంఘం ప్రతినిధులు బి. వెంకటేశ్వర్లు , ఎన్.నర్సింగరావు, మల్లేశం, శ్రావణ్ కుమార్, టి. ప్రభాకర్, సిహెచ్ రవికుమార్, లాలూ, శంకర్, బాలాజీ పాల్గొన్నారు.

'ఆడారి' సొంత నిధులతో పింఛన్లు

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో సమకూర్చిన పింఛన్లను పలువురు లబ్ధిదారులకు జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శుక్రవారం పంపిణీ చేశారు. 91, 92 వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం సందర్భంగా అర్హులైనా తమకు ప్రభుత్వం పింఛన్లు ఇవ్వడం లేదని పలువురు ఆనందకుమార్ దృష్టికి తేగా, ప్రభుత్వం నుంచి పింఛన్లు



పింఛన్లు పంపిణీ చేస్తున్న భాస్కరరావు

మంజూరయ్యే వరకు తన సొంత నిధులతో పింఛన్లు అందిస్తానని మాటిచ్చారు. ఈ మేరకు స్థానిక వైసిపి నేతలు అర్హులుగా గుర్తించిన వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆనందకుమార్ సమకూర్చిన పింఛన్లను స్థానిక వైసిపి నేతలతో కలిసి భాస్కరరావు అందజేశారు. వార్డుల వైసిపి అధ్యక్షులు గొర్లె అప్పలస్వామినాయుడు, గునిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు గేదెల మురళీకృష్ణ, గొంతెన నాగరాజు నీలాపు శ్రీనివాసరెడ్డి, బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'గీతం'లో డిఎస్‌టి సాంకేతిక విజ్ఞాన కేంద్రం



ప్రారంభిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ చైర్మన్ అతుల్‌భట్

ప్రజాశక్తి- మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) ఆధ్వర్యంలో సాంకేతిక విజ్ఞాన కేంద్రం (జి-టెక్)ను విశాఖ స్టీల్‌ప్లాంట్ చైర్మన్ అతుల్ భట్ శుక్రవారం ప్రారంభించారు. స్థానిక పరిశ్రమలకు విద్యాలయాలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, నిరంతర శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, చిన్న మధ్య తరహా పరిశ్రమలతో విద్యాలయాలను అనుసంధానం లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేశారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, అన్నా విశ్వవిద్యాలయం డిఎస్‌టి శాస్త్రవేత్త డాక్టర్ పి.కృష్ణకాంత్, ఎపి మెడ్‌టెక్ జోన్ డైరెక్టర్ మృత్యుంజయ జనా సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, ఎమ్ఎస్ఎమ్ఇ నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ చైర్మన్ అతుల్ భట్ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ రంగంలో డిజిటలైజేషన్, ఆటోమేషన్‌లకు ఇతర దేశాలపై ఆధారపడుతున్న నేపథ్యంలో స్వదేశీ పరిజ్ఞానం అభివృద్ధికి గీతంలోని జి-టెక్‌తో కలిసి పనిచేయడానికి ఆసక్తితో ఉన్నామన్నారు. విశ్వవిద్యాలయాలలో జరిగే పరిశోధనలు పరిశ్రమల అవసరాలను తీర్చేవిగా ఉండాలనిసూచించారు. గీతం అధ్యక్షుడు ఎమ్.భరత్ మాట్లాడుతూ గీతం విశ్వవిద్యాలయం ద్వారా నాణ్యతతో కూడిన పరిశోధనలు జరిపేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, స్థానిక పరిశ్రమల అవసరాలను తీర్చేలా అధ్యయనాలు ఉంటాయన్నారు.

గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ జి-టెక్ విజ్ఞాన కేంద్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన పరిశోధకుల మధ్య బలమైన సంబంధాలను నెలకొల్పడానికి సదస్సులు, వర్క్‌షాప్‌లు, చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును గీతం డీమ్డ్‌విశ్వవిద్యాలయానికి అప్పగించడం పట్ల కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డిఎస్‌టి శాస్త్రవేత్త డాక్టర్ పి.కృష్ణకాంత్ మాట్లాడుతూ దేశంలోని 22 విశ్వవిద్యాలయాలలో టెక్నాలజీ ఎనేబిలింగ్ కేంద్రాలను కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం ఇప్పటి వరకు ఏర్పాటు చేసిందని, ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా గీతంలో రూ. 3.28 కోట్లతో ఏర్పాటైన జి-టెక్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి, గీతంతో పాటు రాష్ట్రంలోని సహ విద్యాసంస్థలను భాగస్వామ్యం చేసే విధంగా పని చేస్తుందన్నారు. వివిధ విద్యా సంస్థలలోని పరిశోధకుల నూతన ఆవిష్కరణలను గుర్తించడం వాటికి మార్కెటింగ్ అవకాశాలను తెలియజేయడంతో పాటు స్థానిక పరిశ్రమల సాంకేతిక అవసరాలను తెలుసుకుని వాటికి అవసరమైన నూతన పరిజ్ఞానాన్ని ప్రయోగశాలలో అభివృద్ధి చేయడంపై జి-టెక్ దృష్టి సారిస్తుందన్నారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, రీసెర్చ్ అండ్ డవలప్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, ప్రోవైస్ ఛాన్స్‌లర్‌లు, డీన్‌లు, సీనియర్ ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రెవెన్యూ సిబ్బందిపై దాడి

ప్రజాశక్తి - ఆరిలోవ : కొండను తవ్వేసి దానిపై తప్పుడు డాక్యుమెంట్లుతో 200 గజాల స్థలాన్ని ఆక్రమించి చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి జరిగింది. దీనిపై చినగదిలి తహశీల్దారు ఆదేశాల మేరకు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసారు. వివరాలివి. తోటగరువు, గణబాబునగర్‌లో సర్వే నెంబరు 55లో కొండ పోరంబోకు స్థలం ఉంది. దీనిని తోటగరువు ప్రాంతానికి చెందిన మొల్లి అప్పారావు అనే ఎయూ ఉద్యోగి కొండను తవ్వేసి, సుమారు 200 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. గతంలో ఈ స్థలంలో నిర్మాణం చేపడుతుండగా, రెవెన్యూ సిబ్బంది అడ్డుకుని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. తరువాత ఆ బోర్డును తొలగించి, తిరిగి ఇటీవల నిర్మాణం మొదలెట్టినట్టు అందిన సమాచారంతో చినగదిలి తహశీల్దారు ఆదేశాల మేరకు శుక్రవారం విఆర్‌ఒలు, ఇతర సిబ్బందితో వెళ్లిన ఆర్ఐ ప్రవీణ్, ఇంటి నిర్మాణాన్ని తొలగించారు. నిర్మాణాన్ని తొలగిస్తున్న విఆర్ఒ భీశెట్టి యువరాజ్‌పై ఇంటి నిర్మాణం చేపడుతున్న మొల్లి అప్పారావు కుమారుడు హేమంత్ దాడి చేసాడు. దీనితో ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. కాగా ఆక్రమణలంటూ తొలగించేందుకు వచ్చి విఆర్ఎ, రెవన్యూ సిబ్బంది తన కాళ్లపై సుత్తితో దాడి చేసి కొట్టాడని హేమంత్ కూడా ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి విజయోత్సవ బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్రంలో వైసిపి పాలన చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గాజువాకలో ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం గాజువాక బిసి రోడ్డులోని టిఎన్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కొత్త గాజువాక, సినిమా హాలు కూడలి, పాత గాజువాక, ఆటోనగర్, బిహెచ్‌పివి మీదుగా తిరిగి పాత గాజువాక చేరుకుని, అక్కడ నుంచి తిరిగి బిసి రోడ్డులోని పార్టీ కార్యాలయానికి చేరుకుంది. పెద్దఎత్తున కార్లు, బైకులతో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఎమ్మెల్యే నాగిరెడ్డిమాట్లాడుతూ, నాలుగేళ్లలోనే 40ఏళ్ల అభివృద్ధిని చేసి చూపిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సిఎం జగన్.సంక్షేమ పాలనను చూసి ఓర్వలేని చంద్రబాబు తప్పుడు ప్రచారాలతో కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.చంద్రబాబు కనుసన్నల్లో పనిచేసే పవన్‌కళ్యాణ్‌కు ప్రజలు మళ్లీ చుక్కలు చూపించడం ఖాయమన్నారు. తండ్రికి మించిన తనయుడిగా రాజశేఖరరెడ్డి కంటే ఎన్నో రెట్లు మెరుగైన పథకాలను ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం ఏర్పరచుకున్న జగన్మోహనరెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో గాజువాక ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నరసింహ పాత్రుడు, ఇమ్రాన్, రాజాన రామారావు, భూపతిరాజు సుజాత, అనూష లతీశ్, ఉరుకూటి చందు, ఎస్‌సి సెల్ రాష్ట్ర నాయకులు మార్టుపూడి పరదేశి, రోజారాణి, గొందేశి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డికి ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి -పద్మనాభం: పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డిగా పనిచేస్తున్న మాదిరెడ్డి ఉషారాణి ఎంపిడిఒగా ప్రమోషన్ కల్పించారు. ఈమేరకు దుంగుడిగూడ ఎంపిడిఒగా నియమిస్తూ బదిలీ చేశారు. జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకు స్థానిక ఎంపిడిఒ ఎంవిజయ్ కుమార్ శుక్రవారం ఉషారాణిని రిలీవ్ చేశారు. పద్మనాభం మండలంలో మూడేళ్ల పది నెలలపాటు ఇఒపిఆర్‌డిగా పనిచేసిన ఉషారాణి మంచి సేవలను అందించారు.

మహిళా మార్ట్ నిర్మాణానికి స్థల సేకరణ అడ్డంకి!

అనువైన చోటు కోసం అధికారుల అన్వేషణ
రూ.20 లక్షల నిధులు పోగేసిన మహిళలు
డబ్బులున్నా ముందుకు సాగని పనులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థికస్వావలంభనకు డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ప్రతిపాదించిన తగరపువలసలో ప్రతిపాదించిన మహిళామార్టు ఇంకా కార్యరూపం దాల్చలేదు. తగరపువలసలో ప్రతిపాదించిన మహిళా మార్టు ఏర్పాటు నేటికీ స్థలసేకరణ గిరిదాటి ముందుకు సాగని పరిస్థితి ఉంది. మహిళా సంఘాల సభ్యుల నుంచి సేకరించిన నిధులతోనే మహిళా మార్టు భవన నిర్మాణం, అందులో వస్తువులను ఏర్పాటు చేసి, వాటి విక్రయం ద్వారా సమకూరిన లాభాలతో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేయడం, ఆదాయాన్ని పెంపొందించుకోవడం, కొంతమంది డ్వాక్రా మహిళలకు ప్రత్యక్షంగా ఉపాధి కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పం.
జిల్లాలో పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలం తగరపువలసలో స్వయంసహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళామార్టుల ఏర్పాటుకు డిఆర్‌డిఎ సంకల్పించింది. ప్రభుత్వపరంగా అధికారులు స్థలాన్ని సమకూరిస్తే, డ్వాక్రా సభ్యుల నుంచి సమీకరించిన నిధులతో మహిళామార్టు నిర్మాణం, నిర్వహణ చేయాలన్నది లక్ష్యం. ఈమేరకు ఆనందపురం, పద్మనాభం మండలాల్లో స్థలాల సేకరణ జరగ్గా, ఆనందపురంలో మహిళామార్టు నిర్మాణం తుదిదశకు చేరుకుంది. పద్మనాభంలో నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉండగా, తగరపువలసలో మాత్రం నేటికీ స్థలాన్ని సమకూర్చుకోలేని పరిస్థితి ఉంది.


ఆనందపురంలో నిర్మాణంలో ఉన్న మహిళా మార్టు

రూ.20లక్షల నిధుల సమీకరణ

తగరపువలసలో ఒక పక్క అనువైన స్థలం కోసం అన్వేషణ చేస్తున్న అధికారయంత్రాంగం, మరోవైపు స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి నిధుల సమీకరణ ఇప్పటికే మొదలెట్టింది. మండలంలో 1016 స్వయం సహాయక సంఘాలలో 10వేలు పైచిలుకు సభ్యులు ఉండగా, ఒక్కో సభ్యురాలి నుంచి రూ.310 చొప్పున, రూ.30.48లక్షలు నిధులను సమీకరించాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటికే రూ.20లక్షల మేర సేకరించారు. సభ్యుల నుంచి సమీకరించిన సొమ్ముతో డిఆర్‌డిఎ మార్గదర్శకాల మేరకు మహిళా మార్ట్‌ను నిర్వహించనున్నారు. మహిళా మార్ట్‌లో అన్ని రకాల నిత్యావసరాలు అందుబాటులో ఉంచనున్నారు.
ఇప్పటికే కాకినాడ వంటి ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మహిళామార్టులు విజయవంతంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో వాటి స్ఫూర్తితోనే విశాఖ జిల్లాలోనూ మొదటి విడతలో ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో ఒక్కొక్కటి ఏర్పాటుకు నిర్ణయించారు. మహిళా సభ్యులే ఈ మార్టుల నిర్వాహకులు కావడంతో ఇంటి అవసరాలకు ఎటువంటి సరుకులు అవసరమౌతాయో అన్న అవగాహన మహిళలకు ఉండడంతో నాణ్యమైన సరుకులను వీటి ద్వారా విక్రయించి, వినియోగదారులకు మేలు చేయడం ద్వారా మంచిలాభాలు పొందవచ్చన్నదే ఆలోచన. వచ్చిన లాభాన్ని సభ్యులందరూ పంచుకుంటారు. ఈ మేరకు మహిళా మార్టులో ప్రముఖబ్రాండ్ల సరుకులను సమకూర్చేందుకు అధికారులు సహకరిస్తారు. ఇప్పటికే ఐటిసి, హెచ్‌యుఎల్, పిఅండ్‌జి తదితర పేరొందిన కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని సరుకులు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.



నమూనా చేయూత మహిళా మార్టు (ఫైల్‌ఫొటో)

అనువైన స్థలం కోసం అన్వేషణ



మహిళామార్ట్ ద్వారా నాణ్యమైన సరుకులను, అందుబాటు ధరల్లో అందిచాలన్నదే లక్ష్యం. వ్యాపారకేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తగరపు వలసలో అనువైన స్థలం కోసం అన్వేషణ చేస్తున్నాం. ఇప్పటికే నిధులు సమీకరణ ప్రారంభించిన నేపథ్యంలో, స్థలం సమకూరిన వెంటనే పనులు చేపడతాం.

బి రంగారావు, ఎపిఎం,
వైఎస్‌ఆర్ క్రాంతిపథం, భీమిలి

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


పుస్తకాలను అందజేస్తున్న టీచర్ మోహనరావు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధిలోని జివిఎంసి గ్రంథాలయానికి కొండపేటకు చెందిన ఉపాధ్యాయులు గంటాన మోహనరావు తన సొంత నిధులు రూ.12 వందలతో సమకూర్చిన ప్రముఖ రచయిత ఆరుద్ర రాసిన 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' నాలుగు సంపుటిల సెట్‌ను శుక్రవారం గ్రంథాలయానికి వితరణగా అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధికి దాతల నుంచి పుస్తకాల సేకరణలో భాగంగా లైబ్రేరియన్ జోగ తౌడు అభ్యర్థన మేరకు సమగ్ర ఆంధ్ర సాహిత్యం పుస్తకాల సెట్‌ను సమకూర్చిన ఉపాధ్యాయుడు మోహనరావును పాఠకులు, గ్రంథాలయానికి వచ్చే నిరుద్యోగులు అభినందించారు.

గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ త్రినాథరావు

ప్రజాశక్తి- సింహాచలం: రానున్న ఆషాడ పౌర్ణమి సందర్భంగా సింహాద్రి అప్పన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు, గిరి ప్రదక్షణ ఏర్పాట్లపై దేవస్థానం ఇఒ వి త్రినాథరావు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గిరిప్రదక్షిణ రోజున కొండ చుట్టూ తిరిగే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎక్కడెక్కడ మంచినీటి సదుపాయం, వసతి మెడికల్ క్యాంపులు పారిశుధ్యం నిర్వహణ, విద్యుత్ దీపాల అలంకరణ తదితర అంశాలపై చర్చించారు.
విద్యుత్, పోలీసు, వైద్యం, రవాణా, జివిఎంసి, ఇతర అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంపై చర్చించారు కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దొడ్డి రమణ, శ్రీదేవి, వర్మ, రామలక్ష్మి, పిల్ల జగన్మోహన్ పాత్రుడు, ు పలువురు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు దేవస్థానం చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు

ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొండ బాబు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రహరీ నిర్మాణ పనులకు వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు శుక్ర వారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టి, నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో క్లినిక్ వైద్యులు, సిబ్బంది స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు

సేవా కార్యక్రమాలతో శివానీ జన్మదిన వేడుకలు


ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి- పిఎం పాలెం : భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మనుమరాలు, ఆరోవార్డు కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక కుమార్తె ఇసక శివాని మొదటి పుట్టినరోజు సందర్భంగా మధురవాడ ప్రాంతంలో పలుచోట్ల శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఆశ్రమాల్లో కేక్ కట్ చేసి, భోజనాలు ఏర్పాటు చేశారు.కొమ్మాది అమ్మవారి ఆలయంలో ఆరో వార్డు అధ్యక్షులు బొట్ట అప్పలరాజు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం ఏఎస్ఆర్ నగర్ వృద్ధాశ్రమంలో 45 మంది వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. ఏడవవార్డు ఉడా కాలనీలో సన్ ఫ్లవర్ ఆర్గనైజేషన్ 25 మంది బదిరులైన పిల్లలకు, రేవళ్లపాలెంలో ఉన్న అమ్మ ఒడి ఆర్గనైజేషన్‌లోనూ, హౌసింగ్ బోర్డ్ కాలనీ షారోన్ ఓల్డ్ ఏజ్ ఆర్గనైజేషన్‌లో కేక్ కట్ చేసి, అనంతరం భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు గాదె రోషి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కొండపల్లి వరలక్ష్మి, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, సియ్యాద్రి కనకరాజు, పిల్ల రమణబాబు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ లోహిత్, వాండ్రాసి సూరి అప్పారావు, దేవర, తాతారావు, ఉమమహేష్, అల్తాఫ్, జాకబ్ పాల్గొన్నారు.

సిసి రోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న సారిపల్లి గోవింద్

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు మధురానగర్ ఏరియాలో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి వైసిపికి చెందిన స్థానిక కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపల్లి గోవింద శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.16 లక్షలతో వీటి నిర్మాణం చేపట్టనున్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ సిబ్బందిచ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి సహకారం అవసరం



డాక్టర్ నీలిమను సత్కరిస్తున్న వైజాగ్ ఫిల్మ్‌సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి- సీతమ్మధార : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ప్రభుత్వంతోపాటు సమాజం సహకరించాల్సిన అవసరం ఉందని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య పి.శ్రీసుధ అన్నారు. స్విట్జర్లాండ్ జెనీవాలో అంతర్జాతీయ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో అవార్డు అందుకున్న ఏటికొప్పాల బొమ్మలపై రూపొందించిన లఘుచిత్రాన్ని శుక్రవారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో పౌరగ్రంథాలయంలో ప్రదర్శించారు. ప్రదర్శనను ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ, మేధో సంపత్తి ఏ ఒక్కరి సొంతం కాదని, దానిని ప్రదర్శించడానికి అందరికీ సమాన అవకాశాలను కల్పించాలని కోరారు. ఏటికొప్పాల బొమ్మలపై లఘుచిత్రాన్ని రూపొందించి, అవార్డు పొందిన తమ యూనివర్సిటీ ఉద్యోగి డాక్టర్ నీలిమను అభినందించారు. అలాగే వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు కూడా డాక్టర్ నీలిమను దుశ్శాలువాతో సత్కరించారు. యూనివర్సిటీలోనూ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలోనే ఈ చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. చిత్ర రూపకర్త డాక్టర్ నీలిమ స్పందిస్తూ, వేదికలపై ఇదే తన తొలి సత్కారమని భావోద్వేగానికి గురయ్యారు.వైజాగ్ ఫిల్మ్‌సొసైటీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సొసైట అధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు, జాయింట్ సెక్రటరీ బి.చిన్నారావు, డాక్టర్ బాబ్జీ, కార్యవర్గ సభ్యులు అనురాధ, మూర్తి, ఆర్.శివకుమార్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు శ్యామలమ్మ అమ్మవారికి భక్తులు కానుకలు, ముడుపులు రూపేణా సమర్పించిన హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. దేవాదాయ శాఖ అధికారులు సమక్షంలో నిర్వహించిన లెక్కింపులో పది రోజులకు గాను రూ.26,565 నగదు వచ్చిందని అధికారులు తెలిపారు. సోమవారం ఆలయం వద్ద మహా అన్నసమారాధ నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకుడు మురళి తెలిపారు .

వ్యవసాయానికి పెద్దపీట

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్



ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం రెండవ విడతలో ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను శుక్రవారం ఆయన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ యంత్ర పరికరాలకు ప్రభుత్వం ప్రతి గ్రూపునకు 40 శాతం సబ్సిడీని, 50 శాతం బ్యాంకు రుణంగా అందజేస్తుందని, 10 శాతం మాత్రమే గ్రూప్ సభ్యులు చెల్లించాలని తెలిపారు. గత ఏడాది మొదటి విడతలో 271 గ్రూపులకు రూ.4.61 కోట్ల విలువైన పరికరాలను అందజేయగా, ఈ ఏడాది 2వ విడతలో 148 సిహెచ్‌సిలకు రూ.2,61,99,072 విలువైన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందించినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి మాట్లాడుతూ జిల్లాలో 450 రైతు భరోసా కేంద్రాల పలు సేవలు అందుతున్నాయన్నారు. రైతులకు సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందిస్తామన్నారు. రైతులకు ఇంకా ఏమైనా కావాలన్నా, వారి సమస్యలనైనా 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి గాని, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలోగాని తెలియజేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్ రావు, ఎంపీపీ గొర్లె సూరిబాబు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ మండలంలోని ఐదు గ్రూపులకు యంత్ర పరికరాలను శుక్రవారం అనకాపల్లిలో మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరవాడ మండలం నుండి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు, వైస్ ఎంపిపి భూస అప్పలరాజు, మండల వ్యవసాయాధికారి సిహెచ్‌చంద్రావతి, ఎఇఒ ఎమ్ నరసింహ మూర్తి, గ్రూప్ సభ్యులు కోరుకొండ వెంకట రమణ, గుండు సాధూరావు, కుంద్రపు తాతాజీ, గెడ్డం బాబూరావు రైతులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని లోపూడి, వడ్డాది, ఆర్ శివరాంపురం, మంగళాపురం రైతు భరోసా కేంద్రాలకు వైయస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా ఒక్కొక్క ట్రాక్టర్ను అనకాపల్లిలో అందజేసినట్లు జడ్పిటిసి దొండా రాంబాబు శుక్రవారం తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ సహాయ పథక సంచాలకులు మణికుమార్

సాంకేతిక పరిజ్ఞానంతో

భూగర్భ జలాలను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

సాంకేతిక పరిజ్ఞానంతో వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంచుకునే దిశగా పనులు చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సహాయ పథక సంచాలకులు (ఏపీడీ) జె.మణికుమార్ పిలుపునిచ్చారు. శ్రీగౌరీ గ్రంథాలయంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 'వర్షపు నీటిని ఒడిసి పట్టండి' అంశంపై జరిగిన మహిళా సదస్సులో ఆయన మాట్లాడుతూ నీటిని నిలువరించక పోతే భవిష్యత్ తరాలవారికి అనేక సమస్యలు ఎదుర్కొవల్సి వస్తుందని చెప్పారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి జి.మహేశ్వరరావు మాట్లాడుతూ జల సంరక్షణ, వర్షం నీటి సంరక్షణ, శుద్ధి చేసిన వ్యర్థ జలాలను తిరిగి వినియోగించడం, వనరుల పునరుజ్జీవం, మొక్కలను నాటడం లాంటి కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి ఆక్రమణ, పూడికలను తొలగించి, ఎగువ ప్రాంతాల నుంచి నీరు పారేలా చేయాలన్నారు. శ్రీ గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సభ్యులు కర్రి హనుమంతరావు, బొడ్డేడ జగ్గఅప్పారావు, మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు

ఆలయ అభివృద్ధికి ఎంవిఆర్ విరాళం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలం తురకలపూడి గ్రామంలో సీతారామాలయం పునర్నిర్మాణం కోసం ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు గురువారం రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇటువంటి సేవ కార్యక్రమాలు చేయడం చాలా ఆనందంగా ఉందని, ఇప్పటివరకు ఎంత సంపాదించినా సంతృప్తి లేదని, ఇటువంటి కార్యక్రమాలు చేయడంతోనే సంతృప్తి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గాలి శ్రీను, తురకల పూడి నాయుడు, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన



నినాదాలు చేస్తున్న సిపిఎం నేత దేముడునాయుడు, మహిళలు

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని జి.చింతవ పంచాయతీ పరిధి లోవపాలెం ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు ఆధ్వర్యంలో ఆ కాలనీ మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ సుమారు 70 కుటుంబాలు నివాసముంటున్న ఈ కాలనీ ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కాలనీలో అంతంత మాత్రంగానే కుళాయిలు ఏర్పాటు చేశారని, వారంలో రెండు రోజులు మాత్రమే కుళాయిలు నీరు వస్తుందని తెలిపారు. గత వారం రోజులు కుళాయిలు ద్వారా నీరు రావడం లేదన్నారు. ఈ నీరు వాడుకకు తప్ప తాగడానికి ఉపయోగకరంగా లేవన్నారు. గత్యంతరం లేక ఈ కుళాయిల నీటినే తాగి అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న యాచరీ వద్దకు వెళ్ళి తాగునీటిని తెచ్చుకొని పొదువుగా వాడుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. పండుగలు, శుభకార్యాలు సమయాల్లో కాలనీవాసులు తాగునీటికి పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతమన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే చర్యలు చేపట్టి ఈ కాలనీలో మంచినీటి పథకం ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని కోరారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టరు, ఎంపీడీవోకు వినతిపత్రాలను అందజేస్తామని తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ

పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని దిబిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండలంలో గల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ పరీక్షా కేంద్రంలో జరుగు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎగ్జామినేషన్ చీఫ్ బుద్ధ కాశి, పీవీ. శేష బాబు లు తెలిపారు. మండలం గల పలు పాఠశాల నుండి 453 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

స్పీకర్ తమ్మినేనిని తక్షణమే బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

కమాండో లేకపోతే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుని ఫినిష్ చేస్తామని బహిరంగంగా పత్రికా, మీడియా ద్వారా ప్రకటనలు చేసిన స్పీకర్ తమ్మినేని సీతారాంను తక్షణమే స్పీకర్ పదవి నుండి గవర్నర్ బర్తరఫ్ చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు దయ దక్షిణ్యాలుతో రాజకీయ పదవులు అధిరోహించి తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన ఊసరవెల్లి తమ్మినేని సీతారాం అని విమర్శించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న ఆయన వ్యాఖ్యలు విధ్వంసకరంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బోడి వెంకటరావు, మళ్ళ గణేష్ పాల్గొన్నారు.

పూడిమడక ఉప్పుటేరులో

పాములు

- భయాందోళనలో మత్స్యకారులు

ప్రజాశక్తి అచ్యుతాపురం

మండలంలోని పూడిమడక ఉప్పుటేరులో శుక్రవారం వందల సంఖ్యలో పాములు ప్రత్యక్షం కావడంతో స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇలాంటివి ఎప్పుడు కనిపించిన సందర్భాలు లేదు. వీటి వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని ఇవి సముద్రంలో ఉండే జెర్రీలు అని కొందరు చెపుతున్నారు. మరి కొందరు కంపెనీ నుండి వెలువడే వ్యర్థాలను ఉప్పుటేరులో కలపడం వల్ల ఇవి వచ్చి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మత్స్యశాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి ఉప్పుటేరులో ప్రత్యక్షమైన పాములు ఏమిటి అన్నవి నిర్ధారణ చేసి, సముద్రంలో నుండి వచ్చాయా లేక కంపెనీ వ్యర్థాలు వల్ల ఉప్పుటేరులో పెరిగాయా అన్న సందేహాన్నీ నివృత్తి చేయాలని మత్స్యకారులు, స్థానికులు కోరుతున్నారు.



ఉప్పుటేరులో తెల్లగా ఉన్న పాములు

ఆకట్టుకున్న రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక ప్రదర్శనలు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జార్జి క్లబ్ వైకె నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ ఆది లీల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నాటిక పోటీల్లో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం బోరివంక శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో 'నిర్జీవ నినాదం' నాటిక, విశాఖపట్నం తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత'? నాటికలను ప్రదర్శించారు. వీటి కథాంశాలను పరిశీలిస్తే వ్యవస్థల దౌర్జన్యం, దాష్టీకం, దమనకాండ భరించలేని స్థాయికి యువత చేరుకొని నిరసన తెలియజేయడానికి తమతమ గళాలను శక్తివంతమైన ఆయుధంగా మార్చడానికి వాడుకునే నినాదమే "విప్లవం వర్ధిల్లాలి". ఈ నినాదాన్ని నమ్ముకుని, వ్యవస్థల్లో మార్పు కోసం, సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమాల దారులెన్నుకుని, సంఘ శ్రేయస్సు కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించి త్యాగం చేసే విప్లవకారుల జీవితాలతో ముడిపడిన కథాంశమే 'నిర్జీవ నినాదం'. కుటుంబ సభ్యుల సామాజిక, శారీరక, మానసిక వ్యథలను నాణానికి మరో వైపు చూపించే ప్రయత్నం చేశారు. నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటిక అక్రమ సంబంధం నేరం కాదని, ఉన్నత న్యాయస్థానం ఐపిసి నుండి 497 సెక్షన్ తొలగించింది. ఈ కారణంగా విడాకులు ఇచ్చుకునే వెసులుబాటు కల్పించింది. మరి నైతిక విలువల మాటేమిటి? వివాహ వ్యవస్థ మాటేమిటి? పిల్లల భవిష్యత్తు ఏంటి? ప్రశ్నించుకుంటే జవాబు శూన్యం. చట్టమే ఆ స్వేచ్ఛనిస్తే ఇక వీటిని ఆపేదెవరు? దీన్ని ఎవరూ ప్రశ్నించరే అనే ప్రశ్న నుండి రాయబడిన నాటికే 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత'? ఈ రెండు నాటికలు ఆహూతులను సమాజం పట్ల ఆలోచింప చేసేవిగా ఉన్నాయి. నిర్వాహకులను ప్రేక్షకులు అభినందిస్తూ ఇటువంటి ప్రదర్శనలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు.



నిర్జీవ నినాదం నాటికలోని ఓ సన్నివేశం



కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ శచీదేవి

ఉదయాన్నే ఉపాధి హామీ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం ఐదున్నర గంటలకే ఉపాధి కూలీలు పనుల్లో చేరాలని స్థానిక ఎంపీడీవో కె.శచీదేవి సూచించారు. ఉపాధి కూలీలకు కూలి డబ్బులు గిట్టుబాటు కావడం లేదని, వేసవి అలవెన్సులు ఇవ్వడం లేదని మే 29న అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీలు ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చౌడువాడలో చేపడుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ ప్రతిరోజు ఎన్ని గంటలకు పనుల్లో చేరుతున్నారని ప్రశ్నించారు. ఉదయం 7 నుండి 10 గంటల వరకు పనులు చేస్తున్నామని, అంతకుమించి ఎండ తీవ్రతతో పనులు చేయలేకపోతున్నామని బదులిచ్చారు. దీనికి స్పందించి ఆమె ఇంకాస్త ముందుగా పనుల్లో చేరాలని, రోజుకు ఐదు గంటలు పనిచేసినట్లయితే కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు. ఇతర అలవెన్సులు ప్రభుత్వం మంజూరు చేసిన మేరకు అందించడం జరుగుతుందన్నారు. ఆమె వెంట స్థానిక ఎంపిటిసి రాజేష్, సచివాలయ కార్యదర్శి నక్క రామనాయుడు ఉన్నారు.

విద్యాకానుక స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక బిఆర్.అంబేద్కర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక స్టాక్ కేంద్రాన్ని ఎంపీడీఓ బి.రమేష్ నాయుడు శుక్రవారం సందర్శించారు. బెల్ట్, షూ, సాక్సు, నోట్ బుక్స్, టెక్స్ బుక్స్, ఆక్స్ ఫర్డ్ డిక్షనరీల నాణ్యతను పరిశీలించారు. స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు తెరచేనాటికి విద్యార్థులందరికీ విద్యా కానుకలు అందజేయాలని ఎంఇఒకు సూచించారు. ఆయన వెంట ఎంఇఒ ఎస్.అప్పలరాజు, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌పిలు, పిటిఐలు, ఐఇఆర్‌టిలు ఉన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

ప్రజాశక్తి-అనకాపల్లి

పోటీ పరీక్షలు రాయాలన్నా, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి ఎస్.రాజారావు పేర్కొన్నారు. శ్రీగౌరీ గ్రంథాలయం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కంప్యూటర్ శిక్షణా తరగతులు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. కంప్యూటర్ ఆవశ్యకత పెరిగిన నేపథ్యంలో గౌరీ గ్రంథాలయం 15 ఏళ్లుగా ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కంప్యూటర్ కోర్సుల్లో చేరడం వలన ఇంగ్లీషు భాషపై పట్టు వస్తుందన్నారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ కంప్యూటర్ బేసిక్స్, ఫండమెంటల్స్, ఎంఎస్-ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, ఇంగ్లిష్ టైపింగ్, కమ్యూనికేటివ్, టాలీ ప్రైమ్, బేసిక్ అకౌంట్స్, అడ్వాన్స్‌డు ఎంఎస్-ఎక్సెల్ మొదలగు అంశాలపై ఏటా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శిక్షణా తరగతుల తుది పరీక్షల పోటీల విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), ఉపాధ్యక్షుడు కాండ్రేగుల జగ్గారావు, బొడ్డేడ జగ్గఅప్పారావు, మళ్ల సూరిబాబు, శిక్షకులు పూడి ఇందిర, ఎం.కృష్ణవేణి, షేక్ నిషా పాల్గొన్నారు.

వేసవి ఉచిత వ్యాయామ శిక్షణ

ప్రజాశక్తి- అనకాపల్లి

శ్రీగౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీ వ్యాయామశాల ఆధ్వర్యంలో వేసవికాలం విద్యార్థులకు ఉచిత వ్యాయామశిక్షణ నిర్వహించడం జరుగుతుందని సంఘం కార్యదర్శి బుద్ధ రమణాజీ పేర్కొన్నారు. వ్యాయామం చేయుటకు వచ్చు పిల్లలకు జీవిఎంసీ, పట్టణ ప్రముఖుల సహకారంతో ప్రతిరోజు ఉదయం పోషక ఆహారం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విల్లూరు రాజేష్, కాండ్రేగుల సురేష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

భాష, గణిత నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం


గణితంలో కృత్యాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- సబ్బవరం

పునాది అక్షరాస్యత, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే జి-20 జన్ భాగీదారి కార్యక్రమం లక్ష్యమని ఎంఇఒ ఎస్.అప్పలరాజు పిలుపునిచ్చారు. మండలంలోని పెద నాయుడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జి-20 జన్ భాగీదారి కార్యక్రమం శుక్రవారం హెచ్‌ఎం దొడ్డి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో జూన్ 1 నుంచి 15 వరకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భాష, గణితంలో కొన్ని కృత్యాలు చేసి వాటిని రాష్ట్ర స్థాయిలో ఉన్న గూగుల్ ట్రాకర్‌లోకి అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌పిలు, పిటిఐలు, అంగన్ వాడీ టీచర్లు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని రామన్న పాలెం గ్రామంలో భాష, గణితంలో పునాది అభ్యాసనా సంకల్ప యాత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ రావు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : జన్ భాగీదారి ప్రదర్శనలో భాగంగా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు తయారు చేసిన టిఎల్‌ఎంని ప్రదర్శించడం జరుగుతుందని ఎంఇఒ దివాకర్ అన్నారు. పాఠశాల స్థాయిలో జిల్లా స్థాయిలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠశాల సంసిద్ధత మేళా, సాంకేతిక వినియోగం, ఎస్ఎంసిలతో తల్లిదండ్రుల కమిటీలతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.


ప్రతిజ్ఞ చేస్తున్న రామన్నపాలెం విద్యార్థులు

అనాథ శవానికి ఘనంగా అంత్యక్రియలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్

ప్రమాదాలు జరిగిన, ప్రాణాలు కోల్పోతున్నా చూసీ చూడనట్లు ఎవరి దారిన వారు పోయే ఈ రోజుల్లో కూడా ఒక అనాథ శవానికి అంత్యక్రియలు జరిపి తన ఉదారత్వాన్ని చాటుకున్నారు మునగపాక సర్పంచ్, గ్రామస్తులు. మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన బొడ్డు అప్పలకొండ అలియాస్ బద్రి(40) శుక్రవారం అకాల మరణం చెందారు. అప్పలకొండ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారాడు. గ్రామంలో చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి వాటిని అమ్ముకుంటూ పొట్ట నింపుకునేవాడు. తలదాచుకోవడానికి పూరి గుడిసె కూడా లేదు. గుడి, బడి, ధర్మసత్రాలే ఆయన నివాసాలు. అప్పలకొండ అకాల మరణం చెందారని సర్పంచ్ దిమ్మల అప్పారావుకు సమాచారం అందడంతో తక్షణమే ఆయన స్పందించి అంత్యక్రియలకు ఆయన ఏర్పాట్లు చేశారు. అనాథ శవం కట్టె మోసి అప్పలకొండ అనాథ కాదు, అతనికి ఆ నలుగురు ఉన్నారని నిరూపించారు. సర్పంచ్‌తో పాటుగా పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలకు సహకరించారు. మరణ వార్త విన్న గ్రామంలో అనేకమంది తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొని తమ సానుభూతిని తెలియజేశారు.



పాడె మోస్తున్న సర్పంచ్ దిమ్మల అప్పారావు తదితరులు


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సోమునాయుడు

ఉపాధి కూలీలకు వేసవి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి అచ్యుతాపురం

మండుటెండలో పనిచేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వేసవి వేతనాలు చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి కె.సోమునాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని దోసూరు, మడుతురు గ్రామాల్లో శుక్రవారం ఆయన ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిశారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమునాయుడు మాట్లాడుతూ పాత పద్ధతిలో ఉపాధి కూలీలకు వేతనాలు, పనిముట్లకు డబ్బులు, టెంట్, మెడికల్ కిట్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి అప్పారావు, లక్ష్మి, పైడ్రాజు, తాతలు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ముగిసిన ఆయుర్వేద కౌశల కార్యక్రమం

ప్రజాశక్తి-అనకాపల్లి

విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆంధ్ర ప్రదేశ్ విభాగం, ఆరోగ్య ధాత్రి ఆయుర్వేద పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కోడూరు గ్రామంలో జరిగిన ఆయుర్వేద కౌశలం కార్యక్రమం శుక్రవారం ముగిసింది. తమిళనాడు, కర్ణాటక, ఒడిస్సా, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి వచ్చిన 50 మంది ఆయుర్వేద వైద్య విద్యార్థులు 5 రోజుల పాటు జరిగిన ఆయుర్వేద కౌశలం ఆవాస కార్యక్రమంలో ఎంతో అనుభవం కలిగిన ఆయుర్వేద వైద్యుల నుండి వమన కర్మ, వస్తి కర్మ, ఉత్తర వస్తి కర్మ, అగ్ని కర్మ, విద్ధ కర్మ, నేత్ర క్రియా కల్పములు, వంటి అతి ప్రాచీన చికిత్సా ప్రక్రియలు, వివిధ ఔషధ నిర్మాణ విధులు నేర్చుకున్నారు. దేశం నలు మూలల నుండి వచ్చిన 20 మందికి పైగా సీనియర్ ఆయుర్వేద వైద్యులు తమ చికిత్సా అనుభవ సారాన్ని వైద్య విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమా మహేశ్వర పట్నాయక్, డాక్టర్ సత్య నారాయణ, కౌశలం కన్వీనర్ డాక్టర్ సుందర రాజ పెరుమాళ్, రవి కాంత్, సత్య ప్రశాంత్, ఈశ్వర రావు, హేమ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

వాలంటరీ వ్యవస్థ రాష్ట్రంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తుందనిఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం వాలంటీర్లను ఘన సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంచాన్ని, అవినీతిని అరికట్టేందుకు ఈ వ్యవస్థ తనదైన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, సచివాలయ కార్యదర్శి శ్రీదేవి, సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామ జోగినాయుడు, మళ్ల జోగారావు, చీర రవణమ్మ, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గందరగోళంగా ఎరువుల పంపిణీ

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతులకు ఇక్కట్లు


ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసే సభ్య రైతులకు ఫ్యాక్టరీ అందించే ఎరువుల పంపిణీ గందరగోళంగా మారింది. గతంలో చెరకు కాటాల ద్వారా సభ్య రైతులకు చెరకు సరఫరా చేసిన అగ్రిమెంట్‌ను బట్టి యూరియా, డీఏపీ, గ్రోమోర్, పొటాషియం తదితర ఎరువులను పంపిణీ చేసేవారు. ఈ ఏడాది చెరకు రైతులకు ఎరువులు పంపిణీ రైతు భరోసా కేంద్రాల చేస్తున్నారు. బుచ్చయ్యపేట చెరకు కాటాకు దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, కోవిలపల్లి, ఐతంపూడి, కెపి.అగ్రహారం, కొండపాలెం, పి.భీమవరం తదితర గ్రామాల రైతులు చెరకు సరఫరా చేస్తారు. వీరందరికీ ఈ కాటా దగ్గరే గతంలో ఎరువులు అందించేవారు. ఈ ఏడాది రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. బుచ్చయ్యపేట, దిబ్బిడి, కందిపూడి, కేపీ అగ్రహారం ఆర్‌బికెలకు సొంత భవనాల్లేవు. నిల్వ చేసుకునే విధంగా గొడౌన్లు లేవు. దీంతో చెరకు కాటా గొడౌన్‌లో నిల్వ ఉంచారు. సభ్య రైతులు చెరకు కాటా వద్దకు వెళ్లి ఫీల్డ్‌మెన్ వద్ద ఎరువుల సరఫరాకు అగ్రిమెంటు రాయించుకొని, ఆ అగ్రిమెంట్ పత్రాలను సచివాలయానికి తీసుకొచ్చి చూపించి, అక్కడ నుండి గొడౌన్‌లకు వెళ్లి ఎరువులు తీసుకోవాల్సి వస్తోంది. దీంతో గంగరగోళం ఏర్పడంతో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాక్టరీ సిబ్బంది అయితే రైతుల సమయాన్ని బట్టి ఎరువుల అందిస్తూ ఉంటారని రైతులు తెలిపారు. గతంలో మాదిరిగానే కాటాల ద్వారా చెరకు రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

బెంబేలెత్తిస్తున్న ఎండ, వడగాల్పులు

ప్రజాశక్తి-కశింకోట : ఎండలు, వడగాలులతో ప్రజలు బంబేలెత్తిపోతున్నారు. శుక్రవవారం నాటి ఎండతీవ్రత, వేడి గాలులతో కశింకోట మండల ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎక్కడ చెట్లు ఉంటే అక్కడ చల్లగాలి కోసం తిష్ట వేశారు. ఎక్కడకక్కడ రోడ్డు పక్కన వాహనాలు నిలిచి పోయాయి. గ్రామాల్లో ప్రజలు నుయ్యలు, శారదా నది, ఏలేరు కాలువ, ఇతర నీటి కుంటల్లో స్నానం చేసి సేద తీరారు. జ్యూస్, కూలింగ్ పానీయాలు, కొబ్బరి బొండాలు ఎక్కువగా అమ్మకం జరిగింది.

పథకాలతో పేదలకు లబ్ధి

ఉప ముఖ్యమంత్రి బూడి


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని వీరవల్లి అగ్రహారంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో 3596 మంది లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా 8 కోట్ల 68 లక్షల 76 వేల లబ్ది చేకూరిందన్నారు. నాడు నేడు పనులకు శిలాఫలకం ఆవిష్కరించారు. 93.84 కోట్లతో వివిధ నిర్మాణాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. 21.66 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైయస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిచారు. అంగన్వాడీ కేంద్రం ను సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఐదుగురు టిడిపి నేతలు మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొత్తపల్లి శ్రీనివాస్, పార్టీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

ఎమ్మెల్యే బాబూరావుకు మొర

ప్రజాశక్తి -కోటవురట్ల: రుద్ర భూమికి రహదారి సౌకర్యం కల్పించాలని పి.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబురావుకు స్థానికులు మొర పెట్టుకున్నారు. గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లేందుకు దారి సక్రమంగా లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ప్రధానంగా వర్షాకాల సమయంలో తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని వాపోయారు. నిధులు మంజూరు చేసి రహదారి సౌకర్యం కల్పించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే పది లక్షలతో రోడ్డు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలో చెరువులో పని చేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. సకాలంలో వేతనాలు అందుతున్నాయా లేదా సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో గడపగడపకు తిరిగి గ్రామస్తుల నుండి వినతులు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కాలనీ ఇళ్ల మంజూరు సమస్యపై తెలిపారు. గ్రామంలో మురుగు కాలువల నిర్మాణంపై మొర పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, గ్రామ సర్పంచ్ ఎలగడ బెన్నమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్, పలు శాఖల అధికారులు, గ్రామ కన్వీనర్ లోకారపు బాబులు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమస్యలను చెపుతున్న మహిళ

పేదల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం

ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ: పేదల ఆర్ధిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామంలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతీ గడపకు వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జడ్పిటిసి సుర్ల గిరిబాబు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ లోచల సుజాత, మండల వైసిపి అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ కొల్లు సత్యనారాయణ, కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణ నాయుడు, వైస్ ఎంపీపీలు సుర్ల బాబ్జి, జక్కు నాగమణి, స్థానిక ఎంపీటీసీ బుల్లి ప్రసాద్, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, ఈఓపిఆర్‌డి రఘురామ్, వెలుగు ఏపిఎం మంగ, ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ సుదీష్ణ, ఆర్ఐ నాగరాజు, కార్యదర్శి శ్రీను, వీఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

అంబులెన్స్ లేక అవస్థలు

- కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరిక
- కెజిహెచ్‌కు రిఫర్..వెళ్లేందుకు వెతలు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: స్థానిక 150 పడకల ఆసుపత్రిలో అంబులెన్స్ లేక పోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఇందుకు సబంధించి బాధితుల కథనం ప్రకారం... రావికమతం మండలం ధర్మవరం పంచాయతీ ధర్మవరం గ్రామం సీరగం జమ్మన్న(67) గదభ తెగకు చెందిన ఆదివాసి గిరిజనుడు. తీవ్ర కడుపు నొప్పితో ఇబ్బందులు పడుతుంటే నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌కి శుక్రవారం తీసుకుని వచ్చారు. ఇక్కడ పూర్తి స్థాయిలో వైద్య సదుపాయాలు లేవని, విశాఖపట్నం కేజీహెచ్ రిఫర్ చేశారు. విశాఖ కేజీహెచ్ వెళ్ళడానికి ఐటిడిఏ అంబులెన్స్ ఏర్పాటు చేయాలని వైద్యాధికారికి బాధితులు విన్నవించారు. ఐటిడిఏ అంబులెన్స్ సిబ్బందికి ఫోన్ చేయగా మొదట డీజిల్ లేదని, పాడేరు మీటింగ్‌లో ఉన్నామని ప్రైవేట్ అంబులెన్స్ పెట్టుకోండి అని సమాధానం ఇచ్చారన్నారు. 108 కి ఫోన్ చేయగా అందుబాటులో లేదని చెప్పారని, దిక్కుతోచని స్థితిలో ఇతరుల వద్ద డబ్బులు తీసుకుని ప్రైవేట్ అంబులెన్స్ లో కెహెచ్ కి వెళ్లడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నట్లు రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలు చెబుతున్నారని, కడుపు నొప్పికి ఆపరేషన్ చేయడానికి అవకాశాలు లేకపోవడం బాధాకరమని బాధితులు వాపోయారు.



వేడుకుంటున్న గిరిజనుడు


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ వేణుగోపాల్

ఎఎల్ పురంలో అభివృద్ధి ఏదీ?

మాజీ జెడ్‌పిటిసి వేణుగోపాల్

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రస్తుతం వైసిపి నాయకులు చేస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమమా. లేక ఆ పార్టీ కార్యక్రమమో చెప్పాలని గొలుగొండ మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, గత నాలుగేళ్ల కాలంలో ఏఎల్‌పురం గ్రామానికి చేసిన అభివృద్ధిని చూపించాలన్నారు. మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు గ్రామంలో బస్‌షెల్టర్ నిర్మించారని, వెటర్నరీ ఆసుపత్రి నిర్మించారన్నారు. రైతు భరోసా, సచివాలయాలు పూర్తి కాలేదన్నారు. అల్లూరి పార్కు అభివృద్ధి కోసం ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో 36లక్షలతో కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తే దాన్ని రద్దు చేశారన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం కోటి కేటాయిస్తే దాన్ని కూడా వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చింతల నారాయణమూర్తినాయుడు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న నేతలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మాడుగుల: కోటి 92 లక్షల రూపా యలతో వివిధ నిర్మాణాలకు గాను శుక్రవారం ఎం కోడూరులో శంకుస్థాపన చేశారు. రహదారులు, కాలువల నిర్మాణానికి రూ.86.50 లక్షలు, జల జీవన్ మిషన్ పథకానికి రూ.70 లక్షలు, ఆడిటోరియం నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు కాగా సర్పంచ్ గొల్లపల్లి సంజీవరావు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు గొల్లవిల్లి రాజేష్, పడాల అప్పలనాయుడు, చింత మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల మంజూరుపై విచారణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: చెట్టుపల్లి గ్రామంలో జగనన్న కాలనీలో అనర్హులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని గ్రామస్తులు జిల్లా కలెక్టరుకు మే నెల 29న ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందన లభించింది. దీనిలో భాగంగానే శుక్రవారం స్థానిక వీఆర్వో నాయుడు ఫిర్యాదు దారుల వద్ద వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా రెల్లి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు మీడియాతో మాట్లాడుతూ, చెట్టుపల్లి గ్రామంలో నిరుపేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాల విషయంలో చాలా అవకతవకలు జరిగాయన్నారు. అనర్హులకు మంజూరు చేసిన ఇల్లపట్టాలను రద్దు చేయాలని కోరారు. గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 537 / 2345 లో 180 మందికి జగనన్న కాలనీ ఇల్లు పట్టాలు మంజూరు చేసారని ఇందులో జరిగిన అవినీతి అక్రమాల పై స్పందనలో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు గ్రామంలో పూర్తిస్థాయి విచారణ జరిపి అనర్హుల పట్టాలు రద్దు చేయాలని కోరారు.


వివరాలు సేకరిస్తున్న వీఆర్వో నాయుడు

గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు




గొలుగొండలో అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి -గొలుగొండ: శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, కబడ్డి డస్టర్ గేమ్‌ను గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ విశ్వనాధుని రాజబాబు గణితంలో సులువు పద్ధతులను వివరించారు.

కోటవురట్ల: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు శుక్రవారం గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు, ఈ సందర్భంగా చిన్నారులు పోటా పోటీగా వేసిన బొమ్మలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సుమారు 17 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : విద్యార్థులు చదువుతోపాటు కలల పట్ల దృష్టి సారించాలని ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. అచ్చుతాపురం శాఖ గ్రంధాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు డాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరతనాట్యం, కూచిపూడి తదితర డాన్స్ కలల పట్ల ప్రావిణ్యత సంపాదించాలన్నారు. విద్యార్థులతో డ్యాన్స్ వేయించారు. పలు భంగిమలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : యోగా చేయడం వల్ల మనసు నిర్మలంగా ఉండి, ఒత్తిడి తగ్గుతుందనికవి కె. సత్తిరాజు అన్నారు. శుక్రవారం మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు యోగా ప్రయోజనాలను వివరించారు. యోగా వల్ల ఆనందం, ఆరోగ్యంతోపాటు మనిషి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటాడన్నారు. అనంతరం చిన్నారులతో యోగాసనాలను అభ్యసనం చేయించారు. ప్రముఖ న్యాయవాది జివికె రాజు కుటుంబ అనుబంధాలు, పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు బాధ్యత వంటి విషయాలపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ అజయ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాల్లో కార్మిక నాయకులు బి.సత్యానందం, చిన్నారులు, పాఠకులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మలేరియాపై అవగాహన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలు గ్రామంలో మలేరియా నివారణ మాసో ఉత్సవాలు నిర్వహించారు. హెల్త్ వెల్నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్ షాజిద్ మాట్లాడుతూ మలేరియాపై అవగాహన ఉండాలని సూచించారు. దోమలకాట ద్వారా మలేరియా, డెంగ్యూ ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కే.గోపాలం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



అసంపూర్తి భవనాన్ని చూపుతున్న అయ్యన్న

పనులు పూర్తి చేసేదెప్పుడు ?

మాజీ మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్:టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర స్ఫూర్తితో ప్రభుత్వ వైఫల్యా లను ఎండగట్టేందుకు ఆ పార్టీ మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పోలీస్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఒకడుగు ముందుకేశారు. ఈ క్రమంలోనే నర్సీపట్నం నియోజక వర్గంలో ఆగి పోయిన అభివృద్ధి పనుల ముందు సెల్ఫీ దిగి అయ్యన్న ఛాలెంజ్ విసురుతున్నారు.సెల్ఫీ చాలెంజ్ ప్రచారాస్త్రంగా స్థానిక ప్రజాప్రతినిధుల వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్లేందుకు అయ్యన్న శుక్రవారం ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో అయ్యన్న మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి జిల్లా పర్యటనలకు వచ్చిన పలు సందర్భాల్లో ఇచ్చిన హామీలు గాలిలోకి కలిసి పోయాయన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నాలుగేళ్లయినా నెరవేరలేదని, బైపరెడ్డిపాలెం, బలిఘట్టం దగ్గర పూర్తయిన టిడ్కో ఇళ్లు 80 శాతం పూర్తయినప్పటికీ పంపిణీ చేయలేదని విమర్శించారు. ఉత్తరవాహితీర మందు వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద ఏసీ కళ్యాణ మండపాన్ని 20 శాతం పూర్తి చేస్తే మిగతా పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. తాము కట్టిన వాటర్ ట్యాంక్‌లకు టిడ్కో ఇళ్లకు రంగులు వేశారు తప్ప చేసింది ఏమీ లేదని విమర్శలు గుప్పించారు. నర్సీపట్నం లో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు టిడ్కో ఇళ్లు నిర్మిస్తే ఇప్పటి వరకూ ఏ ఒక్క లబ్ధిదారుడికి వాటిని మంజూరు చేయకపో వడాన్ని ఎత్తిచూపారు. పట్టణంలో అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న గోవిందరావు

ఎపి గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి–కొత్తకోట:రావికమతంలో జరిగే ఎపి గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం ఈ మేరకు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన హక్కులు, నర్సీపట్నంలో ఐటిడిఏ ఏర్పాటు, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చాలని, గిరిజనుల సమస్యలు ఈ మహాసభలో చర్చిస్తామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాల్లో 90 వేల మంది ఆదివాసి గిరిజనులు జీవనం సాగిస్తున్నారన్నారు.నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు, పుట్టినతేది సర్టిఫికెట్లు, గిరిజన సాగు చేసుకుంటున్న భూములకు రక్షణ లేకుండా పోతుందని తెలిపారు.నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌లో గిరిజనులకు సక్రమంగా వైద్య సౌకర్యాలు అందలేదన్నారు.జీడి మామిడి తోటలపై ఆధార పడి జీవిస్తున్న గిరిజనులకు దళారుల బారి నుండి కాపాడాలని కోరారు. జిల్లావ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు పాల్గొంటారని గోవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

జాతాలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలోని మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర జాత శుక్రవారం విశాఖ అనకాపల్లి జిల్లాల్లో చేపట్టారు.

అనకాపల్లి:రాష్ట్రంలోని మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర జాత శుక్రవారం అనకాపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా జీవీఎంసీ సర్కిల్ కార్యాలయం వద్ద జరిగిన సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో దాదాపు 40 వేల మందికి పైగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బంది, 10వేలకు పైగా సిపిఎస్ ఉద్యోగులు, వెయ్యి మందికి పైగా క్లాప్ డ్రైవర్లు పనిచేస్తున్నారని తెలిపారు. వారిని పర్మినెంట్ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఆప్కాస్ విధానాన్ని తీసుకొచ్చి మరింత బానిసలుగా తయారు చేశారని విమర్శించారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు, హెల్త్ అలవెన్సులు, ఈఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా రావడం లేదన్నారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 ఇవ్వాలని, ఇంజనీరింగ్, మంచినీటి సరఫరా, పార్కుల్లో పనిచేసే కార్మికులకు సెమీ స్కిల్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెటర్నరీ డిపార్ట్మెంట్, ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు రిస్క్ అలవెన్సులు అమలు చేయాలన్నారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పోరాటానికి ఎల్లవేళలా సిఐటియు అండగా ఉంటుందని చెప్పారు. ఈ జాతాలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి జ్యోతి బసు, నాయకులు టి.నూకరాజు, సత్యనారాయణ, మహేష్, రత్నం, శివ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

నర్సీపట్నం టౌన్: రాష్ట్రంలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల ప్రచార జాతాలో భాగంగా రెండవ రోజు నర్సీపట్నం చేరుకున్నారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ జాతాకు నాయకత్వం వహిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఆప్కాస్ విధానాన్ని తీసుకొచ్చి మరింత బానిసలుగా తయారు చేశారని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 20 తర్వాత రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికుల పోరాటానికి ఎల్లవేళలా సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. ఈ జాతాలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి జ్యోతి బసు, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు,కె.ప్రసన్న, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, పర్మినెంట్ సంఘం నాయుకులు కోటి, వరలక్ష్మి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నాయకులు బి.శ్రీనివాసరావు, కుపరాల రాజు, నాని, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి..

గాజువాక : పారిశుధ్య కార్మికులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సిఎం జగన్మోహనరెడ్డి అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త జీపుజాతా శుక్రవారం పాతగాజువాక జంక్షన్‌కు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లింపు, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాల చెల్లింపు, హెల్త్ రిస్క్ అలవెన్స్ చెల్లింపు, అర్హులైన వారసులకు ఉద్యోగావకాశం వంటి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. జాతాలో సిఐటియుగాజువాక జోన్ కమిటీ నాయకులు ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ, నక్క నాగరాజు, వర్కింగ్ సెక్రెటరీ, గణేష్, గొలగాని కుంచమ్మ, ఐద్వా నాయకురాలు, జి మని,లిరాష్ట రాష్ట్ర కోశాధికారి జ్యోతి బసు, ధనాల వెంకట్రావు, లక్ష్మి, రమాదేవి, గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, టి.నూకరాజు, ఉరుకుటి రాజు, జెఆర్ నాయుడు, ఈ.ఆదినారాయణ. పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : తాను అధికారంలోకి వస్తే ఆరు మాసాలలోనే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను, ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని, దానిని తక్షణం అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయి నప్పటికీ కార్మికులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్టర్ల జేబులు నింపడం మినహా కార్మికులకు వైసిపి ప్రభుత్వంలో ఒరిగిందేమీ లేదన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై మున్ముందు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి జ్యోతిబసు, జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, నాయకులు జె.నాయుడు, ఇ.ఆదినారాయణ, గొలగాని అప్పారావు, ఎం.ఈశ్వరరావు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు

- మంచి కథాంశాలతో ఆకట్టుకున్న కళాకారులు - ప్రదర్శనలపై ప్రేక్షకుల ఆదరణ



దర్శకుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి–మాడుగుల: మోదకొండమ్మ పండగ సందర్భంగా మాడుగులలో నిర్వహించిన నాటిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. ఈ నాటికలపై పట్ల ప్రేక్షకులు సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారంతో ఇవి ముగిశాయి. విశాఖ వారి జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన వాయిదాల పెళ్లి నాటిక రక్తి కట్టించింది. కుమార్తె పెళ్లి ఒకే సారి భరించలేక, కట్నం, లాంఛనాలు వాయిదాలపై అల్లుడికి చెల్లించడానికి తండ్రి తపన పడడం, కుమార్తె మరో వ్యక్తిని ప్రేమించడం వంటి హాస్య సన్నివేశాలు రక్తి కట్టించాయి. జి.సీతారామారావు రచించిన నాటికకు సంధ్య ప్రియదర్శిని దర్శకత్వం వహించారు. తండ్రి పాత్రలో మొహిద్దీన్, తల్లి పాత్రలో సంధ్య ప్రియదర్శిని, కుమార్తెగా రమ, పెళ్లి కూతురుగా శివ జ్యోతి, పెండ్లి కుమారుడుగా సతీష్, జోగయ్య పాత్రలో బగాది విజయ సాయి నటించగా ఆర్గనైజర్‌గా రవీంద్ర నాథ్ వ్యవహరించారు.

అనంతరం పిటి మాధవ్ రచన, కవి ప్రసాద్ దర్శకత్వంలో విశాఖ అభినయ వారి శ్రీ కాసీవాసి రావయ్యా సందేశాత్మక నాటిక ఆకట్టుకుంది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు పడే ఇబ్బందులు, కొడుకులు ప్రేమ చూపినా కోడలు పెట్టే వేధింపులు తో శత్మశానంలో చితి పేర్చుకుని తండ్రి ఆత్మహత్యకు పాల్పడడం కథాంశంగా నాటిక ప్రదర్శించారు. ఇందులో సారయ్య పాత్రలో కవి ప్రసాద్, నూకాలుగా సంధ్య ప్రియ దర్శిని, ఆనందరావుగా నాంచారయ్య, రవిగా పి మోహన్, వేదించే కోడలు పాత్రలో రమ, హెడ్ కానిస్టేబుల్ గా మొహిద్దీన్, శివుడు పాత్రలో హరనాథ్ నటించారు. రంగాలంకరణ, ఆహార్యం సాయి, లైటింగ్ థామస్ అందించారు. అనంతరం దర్శకుడు కవి ప్రసాద్‌కు ఆలయ కమిటీ తరపున సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి –కోటవురట్ల: రాజుపేట గ్రామంలో భవన నిర్మాణ కార్మికుడు యారం నవీన్(40) గురువారం సాయంత్రం నిర్మాణ పనుల వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ నారాయణరావు తెలిపారు. భార్య అప్పలనర్శ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. బలిఘట్టం గ్రామానికి చెందిన నవీన్ రాజుపేట గ్రామంలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా పరంజి పైనుంచి జారీ కింద పడుతున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలి అస్వస్థతకు లోనయ్యాడు. 108 వాహనం సహాయంతో నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

ఉప ఖజానాధికారి బదిలీ

ప్రజాశక్తి –కోటవురట్ల: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది ఇందులో భాగంగా కోటవురట్ల ఉపఖజానాధికారిగా పని చేస్తున్న కేఎం నాయుడు అరకు ఉప ఖజానా కార్యాలయానికి బదిలీ కావడంతో శనివారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ఉపఖజానా (ఇన్చార్జ్) అధికారిగా షేక్ మదీనా షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ బాధ్యతలు తీసుకున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి, సుదీర్ఘ కాలం పాటు ఇక్కడ ఆయన కార్యాలయంలో పనిచేయడం పట్ల సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు వీడ్కోలు తెలిపారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి–హుకుంపేట: నూతనంగా రహదారి నిర్మాణం చేపట్టాలని మండలంలోని బూర్జ పంచాయతీ 5 గ్రామ ప్రజలు విన్నవించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, సులిపకన్ నుంచి వాలసి వరకు నూతనంగా రహదారి నిర్మించాలని గ్రామ ప్రజలు కోరారు. ఈ రహదారి గుండా 5గ్రామాల ప్రజలు రాక పోకలు సాగిస్తుంటారని తెలిపారు.